## క్లుప్తంగా

### బెల్టుషాపు నిర్వాహకుడి బైండోవర్



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు పోశాల రమేశ్‌ను తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తుండగా నిర్వాహకుడు రమేశ్‌ని పట్టుకున్నట్లు తెలిపారు. రూ.2లక్షల పూచికత్తుతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

### మిస్సింగ్ కేసు నమోదు



వేలేరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తిపాక రవీందర్ భీవండిలో ఉంటూ కూలీకి వెళ్తున్నాడు. స్వగ్రామమైన వేలేరుకు దీపావళి పండుగకు వచ్చాడు. పండుగ తర్వాత భీవండికి తిరిగి వెళ్లే క్రమంలో ఆర్థిక సమస్యలు రావడంతో గురువారం భార్య స్వరూపతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రవీందర్ భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌లు దేవరాజు, కుమారస్వామిలకు ఇసుక ట్రాక్టర్ తారస పడినట్లు తెలిపారు. ఇసుక తరలింపు అనుమతి పత్రం చూయించాలని డ్రైవర్ కాయిత మహిపాల్‌రెడ్డిని అడుగగా అతడి వద్ద లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మతిభ్రమించి మాట్లాడుతున్నారు..



వేలేరు : అధికారం కోల్పోయిన కారణంగా బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఏఒక్క పని చేయలేదని, బీఆర్ఎస్ నాయకులు కళ్లు తెరిచిచూడాలని హితవు పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి కొండా మురళి చేయూత



పరకాల : అనారోగ్యంతో కామారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సీపతి చేరాలు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చేరాలు మృతదేహానికి నివాళులర్పించిన ఆయన.. తక్షణ సహాయంగా దహన సంస్కారాల కోసం రూ.25వేల ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ సర్పంచ్‌గా చేరాలు గ్రామాభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. చేరాలు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ జయమ్మ, కాంగ్రెస్ నాయకులు రవి, సాంబయ్య, భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన కారోబార్ పైతర ధనుంజయ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీఓ రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధనుంజయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.23 వేలు ఆర్థికసాయం అందించారు. పంచాయతీ కార్యదర్శులు మడికొండ రత్నాకర్, నాగశ్రీ, శ్రీకాంత్, తిరుపతి, రాజారాం, సుమన్, రాజకుమార్, అజయ్ తదితరులు ఉన్నారు.

# అసంపూర్తిగా కిచెన్‌షెడ్లు, డైనింగ్‌హాళ్లు

- మధ్యలోనే నిలిచిన నిర్మాణాలు
- ఆరుబయటే భోజనాలు
- ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



హైస్కూల్‌లో నిలిచిపోయిన కిచెన్‌షెడ్డు నిర్మాణం

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించే కిచెన్‌షెడ్లు, డైనింగ్ హాళ్లు మధ్యలోనే నిలిపోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందలాది మంది విద్యార్థులు చెట్ల కింద, ఆరు బయట భోజనాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు.

**సరిపోని బిల్లులు..**

మధ్యాహ్న భోజన కార్మికులకు అందిస్తున్న బిల్లులు సరిపోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్డుకు రూ.5 అందిస్తే మార్కెట్‌లో రిటేల్‌గా రూ.7కు గుడ్డు కొనుగోలు చేస్తున్నామని వాపోతున్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు వంట చేసేందుకు గ్యాస్ సరఫరా చేయకపోవడంతో కట్టెలపొయ్యి మీదనే వంటలు చేస్తూ నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో గతేడాది అక్టోబర్‌లో అట్టహాసంగా అల్పాహార పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిందని, వేసవి సెలవుల వరకు అల్పాహారం అందించగా ఇప్పటి వరకు అల్పాహారం బిల్లులు రాలేదని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు పెంచాలని, కార్మికుల వేతనాలు పెంచాలని, కిచెన్‌షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, గ్యాస్ సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు, పలువురు స్థానికులు కోరుతున్నారు.



ఆరుబయట విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

### కట్టెలపొయ్యే దిక్కు..



కట్టెలపొయ్యి మీద వంట చేయడం ఇబ్బందిగా ఉంది. పొగతో అనారోగ్యం బారిన పడుతున్నాం. మాకు వంట చేసేందుకు ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. గ్యాస్‌పొయ్యి అందించి డబ్బులు కూడా పెంచి ఇవ్వాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలి. గతేడాది పిల్లలకు అల్పాహారం అందించిన బిల్లులు ఇప్పటికీ రాలేదు. అప్పుల పాలవుతున్నాం.

- గౌని చిలుకమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు

# విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- ఆర్డీఓ నారాయణ

నడికూడ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలని పరకాల ఆర్డీఓ కణ్ణం నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సదర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. 4వ తరగతి విద్యార్థిని సఫియాను తహసీల్దార్ నాగరాజు దత్తత తీసుకొని విద్యా అవసరాలకు అయ్యే ఖర్చులను అందించడం అభినందనీయమని అన్నారు. అన్ని వృత్తుల్లో కంటే ఉత్తమమైన, ఆదర్శమైనది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సఫియాకు పోస్టాఫీస్ సేవింగ్‌బుక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ హనుమంతరావు, ఉపాధ్యాయులు కృపమ్మ, మహ్మద్ సుభాని, శ్రీనివాస్, జయ, సుమలత, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.



సఫియాకు పోస్టాఫీస్ సేవింగ్‌బుక్‌ను అందజేస్తున్న ఆర్డీఓ నారాయణ

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఎల్కతుర్తి : వివాహం అవడం లేదని మద్యానికి బానిసైన వ్యక్తి గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని గోపాల్‌పూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పూర్‌కు చెందిన నీరటి రాము (33) పది సంవత్సరాల నుంచి మద్యానికి బానిసవడంతో ఎవరూ వివాహం చేసుకోలేదు. రెండు నెలల నుంచి ఎల్కతుర్తి మండల కేంద్రంలో గది అద్దెకు తీసుకొని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 20న మద్యం సేవించిన మైకంలో జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాము.. గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

నడికూడ : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని మారుతి గ్రామైఖ్య సంఘం ముస్త్యాలపల్లి, జై హనుమాన్ గ్రామైఖ్య సంఘం చౌటుపర్తి, దుర్గాభవాని గ్రామైఖ్య సంఘం రాయపర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు పండించిన సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. మొదటి రకం ధాన్యానికి రూ.2,320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు కుమారస్వామి, రాజు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక

ధర్మసాగర్ : మండలంలోని సాయిపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామకమిటీలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా సోంపల్లి రణధీర్, అధికార ప్రతినిధిగా సోంపేట సూరిబాబు, ప్రధానకార్యదర్శిగా సోంపల్లి మహేందర్, ఉపాధ్యక్షుడిగా సోంపల్లి ప్రవీణ్, కార్యదర్శి సోంపల్లి సాయికిరణ్, ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గంగారపు చేరాలు, అధికార ప్రతినిధిగా సోంపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శులుగా సోంపల్లి సుధాకర్, కామపాటి స్వామి, సోంపల్లి నరేందర్‌ను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్వేష్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని పలువురు ఉపాధ్యాయులు, జేవీవీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో వారు మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేసి అభినందించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు : బహుమతులతో విద్యార్థులు



ధర్మసాగర్ : జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు



శాయంపేటలో..



వేలేరు : బహుమతులు అందజేస్తున్న రవికుమార్



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న ఎస్సై సాయిబాబు



ఐనవోలులో..

# కేంద్రం విధానాలను ప్రతిఘటించాలి

న్యూశాయంపేట: కేంద్రంలో మూడోసారి అధికారానికి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పాలప్తడుతున్న కార్మిక, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటించాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చుక్కయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రావు సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామ్మూర్తి అధ్యక్షతన గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఏఐఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, యూటీయూసీ నాయకుడు శివాజీ, మహేష్, మల్లేశం, ఉపేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

### రిజర్వేషన్‌లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

హన్మకొండ అర్బన్: జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్ల అమలులో సముచిత స్థానం కల్పించాలని హనుమకొండ జిల్లా బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుడు సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చిన బీసీ డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పాల్గొన్నారు.

### శ్రీమేధాలో ఫ్రెషర్స్ డే వేడుకలు

వరంగల్: వరంగల్ పోచమ్మమైదానంలోని శ్రీమేధా కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి.. తన తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లోని జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లకు చదువుతోపాటు సామాజిక సేవాదృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లతో క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడారు. సమావేశంలో కేడీసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌రావు, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

# బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో మంగళవారం భారీ చోరీ జరిగిన నేపథ్యంలో మండలంలోని పలు బ్యాంక్‌లను ఎస్సై పస్తం శ్రీనివాస్ పరిశీలించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ, డెవలప్‌మెంట్ క్రెడిట్ కమర్షియల్ బ్యాంక్, కొండపర్తిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంథిని గ్రామంలోని ఇండియన్ బ్యాంక్ శాఖలను ఎస్సై సందర్శించి ఆయా బ్యాంక్ మేనేజర్‌లను అప్రమత్తం చేశారు. భద్రతా లోపాలుంటే సరిచేసుకోవాలని అన్నారు. బ్యాంక్‌లో, పరిసరాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది ఉన్నారు.

# మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దామెర : మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా చైర్మన్ బండి అశోక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం సింహగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాలల సింహగర్జనకు మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా గరిగె గౌతమ్, కోకన్వీనర్లుగా సుదమల్ల మహేందర్, కొత్త నాగరాజు, గడ్డం కార్తీక్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కోకన్వీనర్లు దండు రాజు, కూనమల్ల రవీందర్, కొమ్మాలు, మాజీ ఎంపీపీ శంకర్, మాజీ జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సుమలత, శ్రీనివాస్, సాదుకుమారస్వామి, రవీందర్, రాజు పాల్గొన్నారు.

# స.హ చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అనిల్‌గౌడ్

ఆత్మకూరు : ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం పరకాల డివిజన్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సమాచార హక్కు చట్టం– 2005 సెక్షన్ 5(1)(2) ప్రకారం మండలంలో, గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయల్లో స్థానిక అధికార భాషలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఉన్నప్పటికీ అసంపూర్తి సమాచారం ఉందన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట అధ్యక్షుడు విజేందర్, నర్సంపేట యూత్ అధ్యక్షుడు సతీష్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌సుందర్, నీరుకుల్ల అధ్యక్షుడు అంకతి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రతిరోజు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదిగలపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న మురళి

శాయంపేట : మాదిగలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్ అధ్యక్షతన జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డిసెంబర్ 21వ తేదీన హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై చేపడుతున్న ధర్మ యుద్ధం సభకు మాదిగలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు దేవయ్య, సదయ్య, రవీందర్, సురేందర్, మహేష్, సుధాకర్, రాజు, పరమేశ్, మోహన్ పాల్గొన్నారు.

# పేదలకు విద్య, వైద్యం అందించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు గురువారం వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అర్హులైన పేదలకు ఎకరం భూమి ఇవ్వాలని, అలాగే నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంకూరి రాజు, ప్రశాంత్, కృష్ణాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కిషన్‌రెడ్డిపై విమర్శలు సరికాదు

శాయంపేట : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదని బీజేపీ సోషల్ మీడియ మండల కన్వీనర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. వరంగల్‌లో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ అహర్నిషలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు.